ఇద్దరు విఆర్‌ఒలపై సస్పెన్షన్ వేటు

పార్వతీపురం : విధుల్లో అలసత్వం వహించిన ఇద్దరు విఆర్‌ఒలను సస్పెన్షన్ చేసినట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. మరో విఆర్వోకు క్రమశిక్షణ చర్యల్లో భాగంగా ఆర్టికల్ ఆఫ్ చార్జెస్‌కు ఆదేశాలు జారీచేసినట్లు పేర్కొన్నారు. రెవిన్యూ గ్రామసభలు, రీసర్వేల్లో వచ్చిన మ్యూటేషన్ల పరిష్కారంపై సంబంధిత తహశీల్దారులు, విఆర్వోలు, సర్వేయర్లతో జెసి ఈనెల 7న వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో సాలూరు మండలం శివరాంపురం విఆర్‌ఒ దాడి చిన్నయ్య, సీతంపేట మండలం పుల్లిపుట్టి విఆర్వో ఎ.అయ్యప్ప విధుల్లో అలసత్వం వహించడమే కాకుండా, కాలపరిమితి దాటి దరఖాస్తులను పెండింగులో ఉంచడం పట్ల కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనివల్ల అటు రైతులు, ప్రజలకు ఇబ్బందులు వస్తున్నందున ఆ ఇద్దరు వీఆర్వోలను సస్పెండ్ చేసినట్లు తెలిపారు. ఇకపై ఏ ఒక్క వీఆర్వో, విలేజ్ సర్వేయర్ విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

మన్యంలో 1/70 మంటలు

- గిరిజనుల్లో కాక రేపుతున్న స్పీకర్ వ్యాఖ్యలు
- భగ్గుమంటున్న గిరిజన సంఘాలు
- నేడు, రేపు ఏజెన్సీ బంద్

ప్రజాశక్తి - పార్వతీపురం

మన్యం లో 1/70 చట్టం మంటలు రేగుతున్నాయి. టిడిపి కూటమి ప్రభుత్వంలో భాగమైన అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలపై గిరిజన సంఘాలు భగ్గుమంటున్నాయి. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనుల భూములకు రక్షణ కవచంలా ఉన్న 1/70 చట్టాన్ని సవరించాలని సాక్ష్యాత్తూ స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారానికి దారితీశాయి. ఈ వ్యాఖ్యల వెనుక టిడిపి, జనసేన, బిజెపి కుట్రలు దాగివున్నాయనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. ఏజెన్సీ ప్రాంతంలో అభివృద్ధికి అడ్డంకిగా ఉన్న 1/70 చట్టాన్ని సవరించాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు కొద్దిరోజుల క్రితం విశాఖపట్నం లో వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో గిరిజన సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నా టిడిపి కూటమి పార్టీల నాయకుల నుంచి మాత్రం ఎలాంటి స్పందన రావడం లేదు. కూటమి పార్టీలకు చెందిన గిరిజన ఎమ్మెల్యేలు, మంత్రులు కూడా నోరు మెదపడం లేదు. దీంతో ఆదివాసీ గిరిజన సంఘాలు ఈనెల 11, 12 తేదీల్లో ఏజెన్సీ బంద్ నిర్వహించాలని నిర్ణయించాయి. ఇప్పటికే 1/70 చట్టం అమలులో ఉన్న ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనేతరుల ప్రాబల్యం క్రమేణా పెరుగుతూ వస్తోంది. ఆ ప్రాంతాలకు చెందిన గిరిజనుల పేరుతో గిరిజనేతరులు ఇష్టారాజ్యంగా వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. చట్టంలో ఉన్న లొసుగులను అడ్డం పెట్టుకొని గిరిజనేతరులు ఆధిపత్యం వహించే దిశగా అడుగులు వేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఈ చట్టాన్ని సవరిస్తే వ్యాపారం ముసుగులో కార్పొరేట్ వ్యాపారులు ఏజెన్సీ భూములను కైవసం చేసుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయి. గిరిజనులు నివసిస్తున్న గిరి శిఖర గ్రామాల్లో అడవులు సైతం అన్యాక్రాంతమయ్యే ప్రమాదం పొంచి ఉంది. రాజ్యాంగంలోని ఐదో షెడ్యూల్ ప్రకారం 1/70 చట్టం సవరించాలంటే గ్రామసభ, పంచాయతీ తీర్మానాలు వుండాలి. గిరిజన సలహా మండలి ఆమోదం వుండాలి. 1997లో సుప్రీంకోర్టు ఇచ్చిన సమతా తీర్పు ప్రకారం 1/70 చట్టం అమలులో ఉన్న ఏజెన్సీ ప్రాంతాల్లో సెంటు భూమి కూడా తీసుకునేందుకు ఎవరికీ హక్కు లేదు. దీంతో స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలు టిడిపి ప్రభుత్వం చేసిన వ్యాఖ్యలు గానే పరిగణిస్తూ ఆదివాసీ గిరిజన సంఘాలు ఉద్యమానికి సిద్ధమవుతున్నాయి. దీనిలో భాగంగా ఏజెన్సీ బంద్‌కి పిలుపునివ్వడం తో వామపక్షాలు సహా ప్రధాన ప్రతిపక్ష పార్టీలు మద్దతు తెలిపాయి. మంగళవారం గిరిజన సంఘాలు ర్యాలీ, నిరసన ప్రదర్శనలతో కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాయి.

గుమ్మలక్ష్మీపురంలో బైకు ర్యాలీ నిర్వహిస్తున్న వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు

మోటార్ సైకిల్ ర్యాలీ

గుమ్మలక్ష్మీపురం : మన్యం బంద్‌ను జయప్రదం చేయాలని కోరుతూ గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలో సిపిఎం, గిరిజన సంఘం ఆధ్వర్యాన మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ బంద్‌లో గిరిజన సంఘాల నాయకులు, గిరిజన ప్రజాప్రతినిధులు ఉద్యోగులు, విద్యార్థులు, కార్మికులు కర్షకులు పాల్గొని విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగనాయుడు కోరారు. అలాగే జియమ్మవలస మండలం గడసింగిపురం పంచాయితీ ఏనుగులగూడలో మన్యం బంద్ గోడ పత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కోశాధికారి మండంగి రమణ, నాయకులు బి.శంకర్రావు, సన్యాసిరావు, సుబ్బారావు, మోహన్‌రావు, ఆడిత్, జియమ్మవలస మండల సిపిఎం కార్యదర్శి సీతారాం తదితరులు ఉన్నారు.

బంద్‌కు మద్దతు తెలపని గిరిజనులంతా దొంగలే
మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర

1/70 చట్టాన్ని సవరించాలని కోరుతూ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా తలపెట్టిన ఏజెన్సీ బంద్‌కు మద్దతు తెలపని గిరిజన నాయకులు, గిరిజన సంఘాలు దొంగ సంఘాలు, దొంగ నాయకులే. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన భూములకు రక్షణగా ఉన్న చట్టాన్ని సవరించాలని కోరడం వెనుక టిడిపి కూటమి పార్టీల కుట్రలు వున్నాయి. చంద్రబాబు నాయుడు అధికారంలో ఉన్నప్పుడల్లా ఏజెన్సీ చట్టాలను నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. 1/70 చట్టాన్ని సవరించడానికి స్పీకర్ అయ్యన్నపాత్రుడికి ఏం హక్కుంది? రాజకీయ పార్టీలకు అతీతంగా ఏజెన్సీ బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నాను. బంద్ సందర్భంగా నిర్వహించే శాంతియుత ర్యాలీ, ప్రదర్శన ల్లో పాల్గొంటా.

స్పీకర్ వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి : కళావతి

సీతంపేట : స్పీకర్ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే వి.కళావతి అన్నారు. ఈనెల 12న రాష్ట్ర మన్యం బంద్ జయప్రదం చేయాలని గిరిజనులు కోరారు. 1/70 చట్టం పరిరక్షణకు గిరిజనులు రావాలని కోరారు. ఈ బంద్‌కు ప్రజలు సహకరించాలని అన్నారు. స్పీకర్ వ్యాఖ్యలను సిఎం, డిప్యూటీ సిఎం, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి కనీసం ఖండించలేదని ఆరోపించారు.

బంద్‌కు పలు సంఘాల మద్దతు

బంద్‌కు సహకరించండి

పార్వతీపురం టౌన్ : 1/70 చట్టాన్ని సవరించాలని అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా జిల్లాలో ఈనెల 12న జరగనున్న ఏజెన్సీ బంద్‌కు సహకరించాలని గిరిజన, ప్రజా సంఘాల, వామపక్ష నాయకులు కోరారు. ఈ మేరకు స్థానిక ఐటిడిఎ పిఒకు, డిఇఒకు, ఆర్‌టిసి డిఎంను కలిసి విజ్ఞప్తి చేశారు. అధికారులను కలిసిన వారిలో గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పాలక రంజిత్‌కుమార్, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు కద్రక రామస్వామి, గిరిజన సమాఖ్య నాయకులు పువ్వల ప్రసాద్, సిపిఎం, సిపిఐ నాయకులు గొర్లి వెంకటరమణ, తోట జీవ, అఖిల భారత గ్రామీణ వ్యవసాయ కార్మిక సంఘం (అయ్యార్ల) జిల్లా కార్యదర్శి పి.సంగం తదితరులు పాల్గొన్నారు.

సాలూరురూరల్ : మన్యం బంద్‌ను జయప్రదం చేయాలని కోరుతూ మామిడిపల్లిలో ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన గోడపత్రికలను విడుదల చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్ష కార్యదర్శులు వంతల సుందర్రావు, గెమ్మల జానకీ రావు, మర్రి మసి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మక్కువ : ఏజెన్సీ బంద్‌ను జయప్రదం చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో శ్రామిక మహిళా సంఘం నాయకులు వి.ఇందిరా, ఆదివాసీ మండల కార్యదర్శి తాడంగి ప్రభాకర్, సెట్ల చంటి, చౌడేపల్లి కృష్ణ, కొండ తామర అనిల్ తదితరులు పాల్గొన్నారు. అలాగే రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు ఊయక ముత్యాలు, పీడక అసిరి, మర్రి చెంచులు కూడా బందును జయప్రదం చేయాలని ఆదివాసి గిరిజనలంతా పాల్గొవాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

కొమరాడ: బంద్‌ను జయప్రదం చేయాలని గిరిజన సంఘం నాయకులు హెచ్ రామారావు పిలుపునిచ్చారు. మండలంలోని కుమ్మరకుంట పంచాయతీ డంగభద్రలో బంద్‌కు గోడపత్రికలు విడుదల చేశారు. కార్యక్రమంలో మహిళలు గిరిజన ప్రజలు పాల్గొన్నారు.

సీతంపేట : మన్యం బందును జయప్రదం చేయాలని ఎజెఎసి కమిటీ చైర్మన్ బి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు, గిరిజన సంఘం నాయకులు, గిరిజనులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు బి ఉమామహేశ్వరరావు, భాస్కరరావు, శ్రీరాములు, అప్పారావు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు

నామినేషన్ అందజేస్తున్న పిడిఎఫ్ అభ్యర్థి కె.విజయగౌరి (ఫైల్)

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి 10 నామినేషన్లు

నేడు నామపత్రాల పరిశీలన
13 వరకూ ఉపసంహరణకు గడువు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

ఈ నెల 27న జరగనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి నామినేషన్ల సమర్పణ గడువు సోమవారంతో ముగిసింది. చివరిరోజైన సోమవారం పెదపెంకి శివప్రసాద్, సుంకర శ్రీనివాసరావులు నామినేషన్లు వేశారు. దీంతో మొత్తం నామినేషన్లు వేసిన వారి సంఖ్య పదికి చేరింది. నామినేషన్లు సమర్పించిన వారిలో యుటిఎఫ్ బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి, ఎపిటిఎఫ్ బలపరిచిన పాకలపాటి రఘువర్మ, పిఆర్‌టియు బలపరిచిన గాదె శ్రీనివాసులు నాయుడులతో పాటు కోసూరు రాధాకృష్ణ, సత్తలూరి శ్రీరంగ పద్మావతి, నూకల సూర్యప్రకాష్, రాయల సత్యనారాయణ, పోతల దుర్గారావు, పెదపెంకి శివప్రసాద్, సుంకర శ్రీనివాసరావు ఉన్నారు. మంగళవారం నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. ఈ నెల 13తో నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగుస్తుంది. ఆరోజు నాటికి పోటీలో ఎంతమంది ఉన్నారనేది స్పష్టంకానుంది. ఈ ఉపాధ్యాయ స్థానానికి ఎన్నికల అధికారిగా విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ వ్యవహరిస్తున్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లు 22,493 మంది

పోలింగ్ స్టేషన్లు 123
తుది జాబితాను ప్రకటించిన ఆర్ఓ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

ఉత్తరాంధ్ర జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల తుది జాబితాను ఎన్నికల రిటర్నింగ్ అధికారి, విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ సోమవారం ప్రకటించారు. ఈ మేరకు ఉత్తరాంధ్రలోని 5 జిల్లాలలో కలిపి మొత్తం 22,493 మంది ఓటర్లు ఉన్నారు. సోమవారం వరకు ఓటర్లు నమోదు కావడానికి అవకాశం ఇవ్వడంతో 1300 మంది ఓటు కోసం కొత్తగా దరఖాస్తులు సమర్పించారు. వాటన్నింటినీ పరిశీలించి 938 మందిని అర్హులుగా నిర్ణయించారు. దీంతో ప్రారంభంలో 21,555 మందిగా ఉన్న ఓటర్ల సంఖ్య 22,493కి చేరింది. మొత్తం ఓటర్లలో పురుషులు 13, 508 మంది కాగా మహిళా ఓటర్లు 8985 మంది ఉన్నారు.

జిల్లాల వారీగా చూస్తే..

శ్రీకాకుళం జిల్లాలో 5035 మంది, విజయనగరంలో 5223 మంది, పార్వతీపురం మన్యం జిల్లాలో 1488 మంది, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 1488 మంది, విశాఖపట్నం జిల్లాలో 5529 మంది, అనకాపల్లి జిల్లాలో 2825 మంది ఉన్నారు. ఐదు జిల్లాల్లో కలిపి 123 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. జిల్లాల వారీగా చూస్తే శ్రీకాకుళం జిల్లాలో 31, విజయనగరం జిల్లాలో 29, పార్వతీపురం మన్యం జిల్లాలో 15, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 11, విశాఖపట్నం జిల్లాలో 13, అనకాపల్లి జిల్లాలో 24 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు.

ఫైలేరియాను నిర్మూలిద్దాం : కలెక్టర్

ప్రజాశక్తి - బలిజిపేట

పరిసరాలను పరిశుభ్రత పాటించి కలిసికట్టుగా బోధకాల (ఫైలేరియా) వ్యాధిని నిర్మూలిద్దామని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పిలుపునిచ్చారు. మండలంలోని పెదపెంకిలో సోమవారం నిర్వహించిన బోధకాలు వ్యాధి నివారణ, నులిపురుగుల నిర్మూలన మాత్రలు మింగించే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామస్తులకు డిఇసి, అల్బెండజోల్ మాత్రలు అందించి వెంటనే మింగించారు. కలెక్టర్ కూడా స్వయంగా మాత్రలు మింగి అందరిలో స్ఫూర్తి నింపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు ఏ ఒక్కరికీ బోధకాలు వ్యాధి సోకకుండా నివారించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అన్నారు. మండలంలోని 333 మంది వరకు బోధకాలు వ్యాధి బాధితులున్నారన్నారు. బోధకాలు నివారణకు వైద్యులు, ఎంఎల్‌పిఎస్‌తో కూడిన వైద్య బృందాలను ఏర్పాటు చేసి మైక్రో ఫైలేరియా (బోధకాలు) పరీక్షలు రాత్రిపూట నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మండలంలోని 57వేల మందికి బోధకాలు వ్యాధి మాత్రలు మింగించే కార్యక్రమం చేపట్టనున్నామన్నారు. బోధకాలు వ్యాధి పెరగకుండా శుభ్రపరిచే విధానం, వ్యాయామంపై వైద్య సిబ్బందితో ప్రజలకు అవగాహన కల్పించారు. అందుకు అవసరమైన కిట్లను పంపిణీ చేశారు. తొలి మూడ రోజులు ఆరోగ్య కేంద్రాల పరిధిలో గల పాఠశాలలు, పంచాయతీ కార్యాలయాలు, అంగన్వాడీ కేంద్రాల వద్ద ఈ కార్యక్రమం జరగనుందన్నారు. 15 రోజుల తర్వాత ఎఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, ఎంఎల్‌పిఎస్‌లు ఇంటింటికి వెళ్లి మాత్రలు మింగిస్తారని వివరించారు. ఫైలేరియా కారక దోమల నివారణకు జాగ్రత్తలు పాటించాలని కోరారు. గ్రామాల్లోని తడి, పొడి చెత్త వ్యర్థాలను వేరుచేసి చెత్త నుంచి సంపద కేంద్రాల్లో వర్మీ కంపోస్టు తయారీ చేయాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. బోధకాలు వ్యాధి బాధితులు ఎక్కువగా ఉన్న తెలగవీధిలో ఇంటింటికి వెళ్లి ప్రజలతో మాట్లాడారు.

పరీక్ష పై చర్చ లో పాల్గొన్న కలెక్టర్

దేశ ప్రధానమంత్రి న వర్చువల్ గా నిర్వహించిన పరీక్ష పై చర్చ ప్రత్యక్ష ప్రసారాన్ని మండలంలోని పెదపెంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతోపాటు కలెక్టర్ హాజరయ్యారు. తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని ప్రధానమంత్రి సందేశమిచ్చారన్నారు. విద్యార్థులు పాఠ్యాంశాలను కష్టంగా కాకుండా ఇష్టంగా చదివి ఉత్తమ ఫలితాలను సాధించాలని సూచించారు. విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని ఏకాగ్రత, క్రమశిక్షణ, కఠోర శ్రమతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. విద్యార్థుల భవిత కార్డులను పరిశీలించి ఆరోగ్య పరిస్థితులను ఆరా తీశారు. విద్యార్థులకు మంచి పౌష్టికాహారం అందించి రక్తహీనత లేకుండా ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. మధ్యాహ్న భోజన వంటకాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జోనల్ మలేరియా అధికారి డాక్టర్ శాంతి ప్రియ, డిఎంహెచ్ఒ ఎస్.భాస్కర రావు, డిఇఒ ఎన్.తిరుపతి నాయుడు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.రాబర్ట్ పాల్, జిల్లా మలేరియా అధికారి వై.మణి, తహశీల్దార్ రత్నకుమారి, ఎంపిడిఒ విజయలక్ష్మి, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ వినోద్, డాక్టర్ పిఎల్ రఘుకుమార్, పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ కిరణ్మయి, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బోదకాలు నివారణకు అందిస్తున్న చికిత్సను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

వార్డెన్‌ను సస్పెండ్ చేయాలి

- ఎస్ఎఫ్ఐ డిమాండ్
- జెసికి వినతి

ప్రజాశక్తి - పార్వతీపురం

అన్నం బాగోలేదని అడిగిన విద్యార్థులను హాస్టల్ నుంచి తరిమేయడం అన్యాయమని, దీన్ని ఎస్ఎఫ్ఐ తీవ్రంగా ఖండిస్తుందని నాయకులు అన్నారు. సాలూరు బిసి సంక్షేమ పోస్ట్ మెట్రిక్ హాస్టల్ వార్డెను సస్పెండ్ చేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభికకు ఎస్ఎఫ్ఐ నాయకులు సోమవారం వినతిపత్రాన్ని అందించారు. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు డేవిడ్, సింహాచలం మాట్లాడుతూ సాలూరు బిసి సంక్షేమ హాస్టల్లో 40 మంది విద్యార్థులు ఉంటున్నారని, వీరికి వార్డెన్‌గా విధులు నిర్వహిస్తున్న అధికారి సక్రమంగా విధులు నిర్వర్తించడం లేదని, మెనూ సక్రమంగా అమలు చేయడం లేదని, గత నాలుగు రోజులుగా అన్నం ఉప్మాలా వండిస్తున్నారని, ఇదేమి న్యాయమని అడిగిన విద్యార్థులపై బెదిరింపులకు పాల్పడి హాస్టల్ నుంచి తొలగించడం అమానుషమని మండిపడ్డారు. ఆదివారం రాత్రి హాస్టల్లో విద్యార్థులకు పెట్టిన భోజనం నాసిరకంగా ఉండడంతో విద్యార్థులంతా భోజన కంచాలను తిరగవేశారని తెలిపారు. అప్పటికే వార్డెన్‌కు సమాచారం ఇచ్చినా స్పందించకపోవడంతో అందుబాటులో ఉన్న ఎస్ఎఫ్ఐ నాయకులకు విషయం తెలిపారని అన్నారు. నాయకులు ఇదేమి న్యాయమని అడిగితే మీకేమీ సంబంధం లేదని వార్డెన్ చెప్పడంతో విద్యార్థులంతా ఆందోళనకు దిగారని అన్నారు. వెంటనే పై అధికారులను సంప్రదించడంతో సోమవారం ప్రత్యక్షంగా పరిశీలిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన ముగించారన్నారు. దీన్ని అవమానంగా తీసుకున్న హాస్టల్ వార్డెన్ మెనూ కోసం ఫిర్యాదు చేసిన విద్యార్థులను గుర్తించి సోమవారం నుంచి బయోమెట్రిక్ వేయనివ్వకుండా హాస్టల్ నుంచి వారిని పంపించేశారని జెసి శోభికకు నాయకులు వివరించారు. ఇది కొత్త సమస్య కాదని, గతంలో చాలా సార్లు ఇటువంటి పరిస్థితులు హాస్టల్లో నెలకొందని, ఇది చాలా దారుణమని ఇప్పటికే హాస్టల్లో అనేక సమస్యలకు నిలయంగా ఉందని, మరుగుదొడ్లు చాలా దారుణంగా ఉన్నాయని, విద్యార్థులంతా బయటకు పోయే పరిస్థితి ఉందన్నారు. గత రెండేళ్లుగా బిసి విద్యార్థులను హాస్టల్లో చేర్పించకుండా గిరిజన విద్యార్థులతో చలామణి చేస్తున్నారని, దీనివల్ల గిరిజన సంక్షేమ పోస్ట్ మెట్రిక్ హాస్టల్లో విద్యార్థుల శాతం తగ్గిపోతుందని తెలిపారు. ఇకనైనా జిల్లా కలెక్టర్, జిల్లా స్థాయి అధికారులు స్పందించి నేరుగా హాస్టల్‌ను సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకోవాలని, తొలగించిన విద్యార్థులను తిరిగి రప్పించాలని, అలాగే మెనూ సక్రమంగా అమలు చేయకుండా విధులు నిర్వర్తిస్తున్న వార్డెను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

జెసికి సమస్యను వివరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పనుల ప్రగతిని సమీక్షిస్తున్న పీడీ రామచంద్రరావు

28లోగా పనులు పూర్తిచేయాలి

ప్రజాశక్తి - సీతంపేట

ఈనెల 28 లోగా ఉపాధి హామీ చట్టం ద్వారా నిర్వహిస్తున్న గోకులాలు, పాఠశాలల ప్రహరీగోడల పనులను పూర్తిచేయాలని డ్వామాప్రాజెక్టు రామచంద్రరావు అన్నారు. స్థానిక మండల మహిళా సమాఖ్య, ఐటిడిఎ కార్యాలయాల్లో సీతంపేట, భామిని, పాలకొండ, వీరఘట్టం మండలాల ఎంపిడిఒలు, ఎపిఒలతో సమావేశంసోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ మండలాల వారీగా ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేసి వెంటనే బిల్లులు చెల్లించాలని తెలిపారు. పల్లె పండుగ పనులు కూడా త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల్లో జాప్యం ఉండకూడదన్నారు. మెటీరియల్ కాంపౌండ్‌కు సంబంధించిన పనులు నాణ్యతగా త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో సీతంపేట, భామిని, ఎంపిడిఒలు కె.గీతాంజలి, కొండపల్లి సత్యం, సీతంపేట, వీరఘట్టం ఎపిఒలు సాగర్, సత్యం నాయుడు ఇంజినీరింగ్ అసిస్టెంటు పాండురంగ, టెక్నికల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా టెన్త్ పరీక్షలు

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అధికారులంతా సమన్వయంతో పనిచేసి, ఎక్కడా ఎటువంటి సమస్యలు తలెత్తకుండా పరీక్షలు సజావుగా జరిగేలా చర్యలు చేపట్టాలని పిలుపు నిచ్చారు. పరీక్షల నిర్వహణకు ముందస్తు ఏర్పాట్లలో భాగంగా సోమవారం కలెక్టరు కార్యాలయంలో సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం గా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 17 నుంచి ఏప్రిల్ 1 వరకు ఈ పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరుగుతాయని అన్నారు. జిల్లావ్యాప్తంగా 10,455 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరు కానున్న నేపథ్యంలో ప్రతి పరీక్షా కేంద్రంలో పక్కా ఏర్పాట్లు ఉండాలని పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని విద్యా శాఖ అధికారులను ఆదేశించారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా బస్సులను ఏర్పాటు చేయాలని, బస్సు సౌకర్యం లేని గ్రామాల నుంచి ప్రత్యేక బస్సులు నడపాలని ప్రజా రవాణాశాఖ అధికారులకు సూచించారు. రైల్వే గేట్లు గల గ్రామాల నుంచి విద్యార్థులు ముందుగా బయలు దేరేలా చూడాలని తెలిపారు. పరీక్షలు జరుగుతున్న సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు ఏర్పాటు చేయాలని, అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందు బాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షను అమలు చేయాలని, ఎస్కార్ట్, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసులకు తెలిపారు. పరీక్షల నిర్వహణ తనిఖీకి సిట్టింగు, ఫ్లయింగు స్క్వాను ఏర్పాటు చేయాలని, పరీక్షల నిర్వహణ అనంతరం జవాబు పత్రాల బండిల్స్ సకాలంలో పంపేందుకు పరీక్షల నిర్వహణ అధికారులకు తపాలా శాఖ సిబ్బంది సహకరించాలని కలెక్టర్ తెలిపారు. పరీక్షల నిర్వహణలో ఆయా శాఖలకు కేటాయించిన పనులను అధికారులంతా సమన్వయంతో పనిచేసి సమర్ధవంతంగా నిర్వహించాలని కోరారు. డిఇఒ ఎన్.తిరుపతి నాయుడు మాట్లాడుతూ జిల్లాలో 220 పాఠశాలలకు చెందిన 10,455 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. వీరిలో 10,367 మంది విద్యార్థులు రెగ్యులర్ కాగా, 88 మంది ప్రైవేటుగా పరీక్షలకు హాజరుకానున్నారని అన్నారు. జిల్లాలోని 67 పరీక్షా కేంద్రాలకు 67 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 67 మంది శాఖాధికారులు, 3 ఫ్లయింగ్ స్క్వాడ్ లను నియమిస్తున్నట్లు తెలిపారు. మార్చి 17 నుంచి 28 వరకు ఉదయం 9.30 గంటల నుంచి 12.30 గంటల వరకు, మార్చి 3 నుంచి 15వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు సార్వత్రిక విద్యా పీఠం ఆధ్వర్యంలో జరగనున్నాయని పేర్కొన్నారు. టెన్త్ పరీక్షలకు 560 మంది, ఇంటర్ కు 426 మంది రెగ్యులర్ విద్యార్థులు హాజరు కానున్నట్లు చెప్పారు. సమావేశంలో డిఆర్ఒ కె.హేమలత, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రామాలకు ఉపయోగపడే పనులు చేపట్టాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

ఉపాధిహామీ కింద గ్రామాలకు ఉపయోగ పడే పనులు చేపట్టాలని కలెక్టర్ ఏ శ్యామ్ ప్రసాద్ అన్నారు. సోమవారం ఆయన జిల్లా, మండల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువులు, నీటి నిలువ కట్టడాలు, పంట పొలాలకు వెళ్లే కాలువల పూడిక తీత తదితర పనులు చేపట్టాలన్నారు. గృహ నిర్మాణంలో 90 రోజుల పని దినాలు ఉపయోగించ వచ్చని అన్నారు. ఎంఎస్ ఎం ఇ సర్వే లో గ్రామ, వార్డు సచివాలయం సిబ్బంది అంతా పాల్గొనాలని ఆదేశించారు. మున్సిపాలిటీల్లో ప్రగతి తక్కువగా ఉందన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కింద అందిన అర్జీలకు సంతృప్తికర పరిష్కారం అందించాలని ఆదేశించారు. రైతులు పిఎం కిసాన్ పథకం కింద రైతు నమోదు కార్యక్రమంలో ఫిబ్రవరి మాసాంతానికి నమోదు కావాలని స్పష్టం చేశారు. పిఎం సూర్య ఘర్ క్రింద ఎక్కువ యూనిట్లు నమోదు కావాలని ఆయన ఆదేశించారు. గురువారం "పల్లె నిద్ర" కార్యక్రమంలో నిర్వహించాలని, శుక్రవారం గ్రామ దర్శిని కార్యక్రమంలో సూర్య ఘర్ గృహాలను సందర్శించాలని ఆదేశించారు. పిఎం జన్ మాన్ పనులు వేగవంతం చేయాలని ఆయన ఆదేశించారు

18, 24న ఎన్నికల పిఒలకు శిక్షణ

జెసి ఎస్ఎస్ శోభిక మాట్లాడుతూ ఈ నెల 18, 24 తేదీల్లో ఎమ్మెల్సీ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంబంధిత అధికారులు ఆయా విభాగాల ఏర్పాట్లను పర్యవేక్షించాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఐటిడిఎ పిఒలు అశుతోష్ శ్రీవాస్తవ, సి యశ్వంత్‌కుమార్‌రెడ్డి, డిఆర్ఒ కె.హేమలత, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎస్. భాస్కరరావు నులిపురుగుల మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోధకాలు రాకుండా ఉండేందుకు ఈ నిలుపురుగుల మాత్రలు వేసుకోవాలన్నారు. మండలంలో 56 ప్రాథమిక పాఠశాలలో ఆరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 84 అంగన్వాడి కేంద్ర పిల్లలకు ఈ మాత్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్‌బీకే ప్రోగ్రాం అధికారి రఘు, వైద్యాధికారులు మీ పావని, పి ఉషారాణి, ఎం రాధాకాంత్, ఎం లావణ్య, ఇఒ జి సూర్యనారాయణ, ఎస్ రమణ, హెచ్.వీలు రమణ, వరలక్ష్మి, వైద్య సిబ్బంది, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

కురుపాం : రక్తహీనత, పోషకాహారలోపం నివారణ, పిల్లల ఆరోగ్యం మెరుగుకు డీ-వార్మింగ్ డే కార్యక్రమం దోహదపడుతుందని వైద్యారోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్ మోహనరావు అన్నారు. జాతీయ నులిపురుగులు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా కురుపాంలోని అంగన్వాడీ కేంద్రాల్లో, కేజీబీవీలో విద్యార్థులకు ఆల్బెండ జోల్ మాత్రలు మింగించే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నులిపురుగుల సంక్రమణ వల్ల పిల్లల్లో పోషకాహారలోపం, రక్తహీనత, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, కడుపు నొప్పి, వాంతులు, వికారం, నీరసం వంటి ఆరోగ్యసమస్యలు ఎదుర్కొంటారని, కార్యక్రమంలో డాక్టర్ చీకటి శంకరరావు, డెమో యోగీశ్వరరెడ్డి, ఎపిడెమిక్ ఇఒ సత్తిబాబు, వైద్య, అంగన్వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్వతీపురం: విద్యార్థికి నులుపురుగుల మాత్రలు వేస్తున్న వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్

సీతంపేట : స్థానిక గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో డిప్యూటీ డిఇఒ కె.రవిప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో డీ-వార్మింగ్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేసే కార్యక్రమం నిర్వహించారు. 450 విద్యార్థులకు వేయించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, ప్రధానోపాధ్యాయులు చంద్రరావు, డిప్యూటీ వార్డెన్ రామ్మోహన్‌రావు. తదితరులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి: మండలంలోని పలు అంగన్వాడీ కేంద్రాల్లోని పిల్లలకు నులిపురుగుల నివారణకు సంబంధించిన మాత్రలను వేయించారు. కొమరాడ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని గరుగుబిల్లి, పెదగుడబ, రావివలస సెక్టార్ల సూపర్వైజర్లు రౌతు లక్ష్మి, అరుణ కుమారి ఆధ్వర్యాన అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు శ్రీసాయినికేతన్ హైస్కూల్, తదితర పాఠశాలల్లో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేయించారు. కార్యక్రమంలో రావివలస పంచాయతీ కార్యదర్శి రంభ శశిభూషణరావు, ఎఎన్ఎం బొత్స శ్రీదేవి, శ్రీ సాయినికేతన్ హైస్కూల్ హెచ్ఎం రొంపిల్లి ఉదయకిరణ్, యాజమాన్య సిబ్బంది పక్కి సదాశివరావు, పెద్దింటి శ్రీధర్, చిగురువలస లీలాప్రసాద్, పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్ : జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమం సందర్భంగా పట్టణంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు, పలు పాఠశాలలు, జూనియర్ కాలేజీలోని విద్యార్థులు అల్బెండెజోల్ మాత్రలను అందజేశారు. కార్యక్రమములో యుపిహెచ్‌సి, పిపి యూనిట్ మెడికల్ అధికారులు, మున్సిపల్ ఎఎస్ఒ వీరినాయుడు, సచివాలయాల హెల్త్ సెక్రటరీలు, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : స్థానిక కెజిబివి, జడ్పీ హెచ్ పాఠశాలల విద్యార్థులకు నులిపురుగుల నిర్మూలన మాత్రలు పంపిణీ చేశారు. భద్రగిరి సిహెచ్‌సి హెల్త్ కౌన్సిలర్ పడాల ప్రమీల ఆధ్వర్యంలో పిల్లలకు డీ వార్మింగ్ మాత్రలు మింగించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి పి.మౌనిక, ఎఎన్ఎం బి.అలేఖ్య, హెల్త్ అసిస్టెంట్ రమేష్ ఉన్నారు.

సీతానగరం: నులుపురుగుల మాత్రల పంపిణీని పరిశీలిస్తున్న డిఎంహెచ్ఒ భాస్కరరావు

పార్వతీపురంరూరల్ : మండలంలోని బందలుప్పి పిహెచ్‌సిలో వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు, ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో గల విద్యార్థులకు అల్బెండ్‌జోల్ మాత్రలు వేయించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ జయగౌడు, ఎఎన్ఎం, ఎంఎల్ హెచ్‌పి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతంపేట : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నులి పురుగులు నిర్మూలన దినోత్సవం ప్రిన్సిపల్ సుశాంత్‌జన ఆధ్వర్యంలో నిర్వహించారు. మాత్రలు భోజనం అనంతరం వేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ప్రభాకరరావు, అధ్యాపకులు శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం: స్థానిక పిహెచ్‌సి పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలోతో పాటు జూనియర్ కళాశాలలో 5752 మంది విద్యార్థులకు గాను 5520 విద్యార్థులకు ఆల్బెండజోలు మాత్రలు మ్రింగించి 95.9 శాతం నమోదైనట్లు వైద్యాధికారులు పి.ఉమామహేశ్వరి, బి.ప్రదీప్‌కుమార్ తెలిపారు. నులి పురుగుల డే కార్యక్రమాన్ని ప్రోగ్రాం అధికారి వినోద్ కుమార్ కోమటి వీధి పాఠశాలను పరిశీలించారు.

రైతుబజారును వినియోగంలోకి తెస్తాం

'ప్రజాశక్తి' వార్తకు స్పందన

ప్రజాశక్తి - సాలూరురూరల్

స్థానిక రైతుబజారును మళ్లీ వినియోగంలోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు జిల్లా అగ్రిట్రేడ్, మార్కెటింగ్ అధికారి ఎల్.అశోక్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ప్రజాశక్తి'లో సోమవారం ప్రచురితమైన నిరుపయోగంగా రైతు బజార్ అన్న వార్తకు ఆయన స్పందిస్తూ రైతుబజారు నిర్వహణకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. 2019లో సాలూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో దండిగాం రోడ్డులో రూ.36 లక్షల ఖర్చుతో రైతు బజారును నిర్మించామన్నారు. రైతులను ఒప్పించి రైతుబజారును కొనసాగేలా చేశామన్నారు. కాలక్రమంలో రైతుబజారు దగ్గరకు వినియోగదారులు రాక పోవడం, సాలూరు ప్రాంత వాసులకు దూరం కావడంతో వినియోగదారులు రైతుబజారుపై ఆసక్తి చూపలేదన్నారు. రైతులు తెచ్చే కూరగాయలు అమ్ముడుపోకపోవడం వల్ల వారికి నష్టం కలగడంతో వారు కూడా రావడం లేదని అన్నారు. ఈ విషయమై మళ్లీ రైతుబజారును వినియోగంలోకి తెచ్చేందుకు ప్రయత్నాలు ప్రారంభించినట్లు ఆయన ఆ ప్రకటనలో వివరించారు.

12న చక్ర స్నానం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని తోటపల్లి గ్రామంలో ఉన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం శ్రీ వేంకటేశ్వర స్వామి, శ్రీ కోదండ స్వామికి వారికి చక్ర స్నానం చేయనున్నామని ఆలయ కార్యనిర్వహణ అధికారి వివి సూర్యనారాయణ సోమవారం తెలిపారు. స్వామి వారి వార్షిక కళ్యాణ మహోత్సవంలో భాగంగా బుధవారం ఉదయం 9గంట నుండి పవిత్ర నాగావళి నది వద్ద స్వామి వారికి, అమ్మవార్లకు శ్రీచక్రస్నానం నిర్వహిస్తామన్నారు. ఆలయంలో హుండీలను గురువారం ఉదయం 10గంటలకు తెరచి లెక్కిస్తామన్నారు. ఆసక్తి గల భక్తులు, సేవకులు ఈ కార్యక్రమంలో పాల్గొవాలని తెలిపారు.

సినీ రంగంపై ఉన్న ప్రేమ రైతులపై లేదా?

ప్రజాశక్తి - కొమరాడ

సినిమా రంగం మీద ఉన్నంత ప్రేమ రాష్ట్ర ప్రభుత్వానికి రైతులపై ఎందుకు లేదని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి ప్రశ్నించారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తిను బండారాలను తమకు నచ్చిన రేటుకు అమ్ముకునే విధంగా సినిమా థియేటర్లలో క్యాంటీన్లకు అనుమతులిచ్చిన ప్రభుత్వం రైతులు పండించిన పంటకు రైతులు తాము నచ్చిన విధంగా అమ్ముకోవడానికి ఎందుకు అనుమతి ఇవ్వరని ప్రశ్నించారు. సినిమాహాల్లో తినుబండారాలు అధిక రేట్లకు అమ్మడం వల్ల ప్రజల జేబులు గుల్ల అవుతున్నాయని, అధిక రేట్లు అమ్ముకోవడానికి ప్రభుత్వం లైసెన్స్ ఇచ్చిందా లేక క్యాంటీన్ వారు తమకు ఇష్టం వచ్చినట్టు అమ్ముకుంటున్నారా అనే విషయంపై వెంటనే దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు.

రైతులతో మాట్లాడుతున్న ఎఒ సౌజన్య

రైతులు విశిష్ట సంఖ్య నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

సొంత భూమి కలిగిన రైతులు విశిష్ట సంఖ్య నమోదు చేసుకోవాలని స్థానిక వ్యవసాయ అధికారి జె సౌజన్య రైతులకు సూచించారు. సోమవారం మండలంలోని ఆడారు పంచాయతీ పరిధి చేబియ్యంవలస గ్రామంలో రైతు వివరాలు సేకరిస్తున్న కార్యక్రమాన్ని పరిశీలించారు. కేంద్ర రాష్ట్రాలు ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు పిఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, రాయితీలు, పెట్టుబడులు, పంటలు బీమా, కనీస మద్దతు, పంట రుణాలు వివిధ రకాల వ్యవసాయ అనుబంధ శాఖల ద్వారా లబ్ధి పొందడానికి ఈ నమోదు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రతి రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ఘనంగా శ్రీనివాస కల్యాణం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని తెట్టంగిలో 48వ మహాలక్ష్మి పేరంటాలు ఉత్సవాల్లో భాగంగా సోమవారం అలివేలు మంగ, పద్మావతి, సమేత శ్రీనివాస కళ్యాణ వైభోగం ఘనంగా నిర్వహించారు. గుజ్జల నారాయణరావు- జయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలకు గ్రామ పెద్దలతో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

పోలమాంబ హుండీ ఆదాయం రూ.19.16 లక్షలు

ప్రజాశక్తి - మక్కువ

రాష్ట్ర గిరిజన జాతరగా గుర్తింపు పొందిన శంబర పోలమాంబ అమ్మవారి మూడు నెలల ఏడు రోజులకు సంబంధించిన హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించగా రూ.19.16లక్షలు వచ్చినట్లు ఇఒ వివి సూర్యనారాయణ వెల్లడించారు. దేవాలయం చదురు గుడి వద్ద ఉన్న 6 శాశ్వత హుండీలను లెక్కించగా రూ.14.62లక్షలు, వనం గుడి వద్ద గల 6 శాశ్వత హుండీలను లెక్కించగా రూ.4.53లక్షలు ఆదాయం వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ డిఇఒ రాజారావు, మాజీ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ దాలినాయుడు, ఎంపిటిసి పోలినాయుడు, ఉత్సవ కమిటీ చైర్మన్ తిరుపతిరావు, పెద్దలు ఉపసర్పంచ్ వెంకటరమణ, విజయనగరం పైడితల్లి అమ్మవారి సేవకులు పాల్గొన్నారు.

చినమరికిలో బోర్లకు మరమ్మతులు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

మండలంలోని చినమరికిలో కొంత కాలంగా చేతి బోర్లు మూలనపడ్డాయి. ఈ సందర్భంగా గ్రామస్తులు గవర గుంప స్వామి నాయుడు, గొబ్బూరు శంకర్రావు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం మండలంలోని బోర్ మెకానిక్ మరమ్మత్తులు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఉపాధి పనుల పరిశీలన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జియమ్మవలస మండలం పెదమేరంగి జన్నిగెడ్డ ఫీడర్ ఛానల్ వద్ద జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఎంపిడిఒ రమేష్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వేతనదారుల హాజరును పరిశీలించారు. ఒకరి జాబ్‌కార్డు పేరు మీద మరొకరు పనులకు హాజరు కావద్దని, సమయ పాలన పాటించాలని, పనికి రాని వారి పేర్లు మస్తర్లులో వేయవద్దని అన్నారు.

ఇష్టంతోనే చదవాలి : ఎంఇఒ

ప్రజాశక్తి - సీతానగరం

విద్యార్థులు కష్టమైన ఇష్టంతోనే చదవాలని ఎంఇఒ జి.సూర్యదేవుడు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానమంత్రి మ్యూచువల్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరీక్ష సమయాలలో ప్రశాంతంగా చదవాలన్నారు. ప్రశాంతతతోనే ఉత్తీర్ణత సాధించగలమన్నారు. ప్రశాంతత ఏకాగ్రత ఈ అంశాలను విద్యార్థులు గుర్తుపెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఈ ప్రసన్న లక్ష్మి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

మురికి కూపంగా ఇందిరమ్మ కాలనీ

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీలోని గల ఇందిరానగర్‌లో ఎక్కడికక్కడ చెత్తా చెదారం, కాలువల్లో మురుగునీరు నిల్వలతో మురికి కూపాన్ని తలపిస్తుందని సిపిఎం పట్టణ కార్యదర్శి దావాల రమణరావు అన్నారు. ఈ మేరకు సోమవారం సిపిఎం బృందం ఇందిరానగర్‌తో పాటు ఏలాం సెంటర్, అంబేద్కర్ విగ్రహం, విజయ హాస్పిటల్, సత్యసాయి కాలేజీ పక్కన ఉన్న ఇరిగేషన్ కాలువ (6,7 వార్డుల పరిధి)ను పరిశీలించింది. నగర పంచాయతీ మురికి కాలువగా మారడంతో బృందం ఆందోళన వ్యక్తంచేసింది. పారిశుధ్య సమస్యపై పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని స్థానికులు బృందం దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం రమణారావు మాట్లాడుతూ కాలువల్లో పూడికలు తీయించకపోవడంతో మురుకు నీరు నిల్వతో పాటు, పిచ్చిమొక్కలు పెరిగి విషసర్పాలు సంచరిస్తున్నాయన్నారు. మురికి నీరు ప్రవహిస్తున్న నివాస ప్రాంతాల వద్ద సర్పాలు కనిపించడంతో ఆ ప్రాంత ప్రజలు భయభ్రాంతులకు గురౌతున్నారన్నారు. పారిశుధ్య మెరుగుకు నగర పంచాయతీ లక్షలాది రూపాయిలు ఖర్చు చేసినా, ఎక్కడి పూడికలు అక్కడే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సిల్ట్ క్లియరెన్సుకు నగర పంచాయతీ ఇప్పటివరకు ఎంత ఖర్చు చేసింది? ఏ ఏ వార్డుల్లో పూడికలు తీసి అక్కడ ప్రజలకు ఎలా ఉపయోగపడిందన్న అంశంపై శ్వేత పత్రం విడుదల చేయాలని కోరారు. ఎందుకంటే నగరపంచాయంలో పారిశుధ్యం అధ్వాన్నంగా ఉందని, తక్షణమే సంపూర్ణ పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మల్లవరపు రమేష్, కాదా రాము, దూసి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

పలు వీధులను పరిశీలించిన సిపిఎం బృందం

మురుగు కాలువను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

అజాగ్రత్తగా వాహనాలు నడపొద్దు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

వాహనదారులు అజాగ్రత్త, బాధ్యతారహిత్యంగా వాహనాలు నడపకూడదని ఇంధన శకట తనిఖీదారు(ఎంఇఐ) యం. శశికుమార్ అన్నారు. రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా సోమవారం జిల్లా రవాణా శాఖా కార్యాలయంలో రహదారి ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు గూర్చి మాక్స్ క్యాబ్/ టాక్సీ క్యాబ్, మోటార్ క్యాబ్ డ్రైవర్లకు సోమవారం అవగాహన కల్పించారు. వాహనదారులకు ట్రాఫిక్ సిగ్నల్స్, నిబంధనలపై, రహదారి ప్రమాదాలపై అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులకు ఇచ్చే ప్రోత్సాహక లబ్ధి కోసం జిల్లాలోని ట్రాన్స్‌ఫోర్టు వాహనాలు నడిపే ప్రతి డ్రైవర్ ఇస్రామ్ పోర్టల్‌లో తమ పేరు, ఇతర వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. అధిక వేగం, మద్యం సేవించి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపకూడదని, అలా నడపడం వల్ల జరిగే అనర్థాలు గురించి తెలిపారు. ప్రతి 6 మాసాలకు ఒకసారి కంటి, ఆరోగ్య పరీక్షలు చేసుకోవాలని, అనుమానితులు మాదకద్రవ్యాలను బస్సులలో రవాణా చేసినచో వారిని గుర్తించి సంబంధిత పోలీస్ స్టేషన్లలో తెలిజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సహాయ ఇంధన శకట తనిఖీదారు జి సత్యనారాయణ (ఎఎంఇఐ), అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ జి సీతారాం, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి నారాయణ రావు, రవాణా శాఖకు సంబంధిన మినిస్టీరిల్ సిబ్బంది, పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ఎంఇఐ శశికుమార్

ఐటిఐలో పిఎం అప్రెంటీస్‌షిప్ మేళా

ప్రజాశక్తి- సాలూరు రూరల్

స్థానిక ప్రభుత్వ ఐటిఐలో సోమవారం ప్రధానమంత్రి అప్రెంటిసిప్ మేళాను వివిధ కంపెనీలు నిర్వహించాయి. ఈ సంవత్సరంలో స్థానిక ఐటిఐలో రిలీవ్ అయిన విద్యార్థులు 56 మంది పాల్గొన్నారు. ఇందులో హైదరాబాద్‌కు చెందిన ఎన్ఆర్‌బి బేరింగ్స్ లిమిటెడ్ సంస్థకు 18 మంది విద్యార్థులు, విశాఖ పట్నం విశ్వాస్ లిమిటెడ్ సంస్థకు 8 మంది, బొబ్బిలి పాటిల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ సంస్థకు 9 మందిని ఎంపిక చేశారు. హైదరాబాద్‌కు చెందిన కంపెనీలో ఎంపికైన విద్యార్థులకు నెలకు ఒక్కొక్కరికి రూ.15వేలు, విశాఖ సంస్థకు ఎంపికైన వారికి రూ. 12,500 బొబ్బిలి సంస్థకు ఎంపికైన వారికి రూ. 14వేలు ప్రతినెల అందజేస్తారని, ఎంపికైన అభ్యర్థులు ఈ నెల 15 నుండి వారు ఎంపికైన సంస్థలలో చేరాలని సంస్థ ప్రతినిధులు ధ్రువ పత్రాలను అందజేశారు. ఈ అవకాశాలను ఐటిఐ చదివిన ప్రతి ఒక్క విద్యార్థి అందుకొని జీవితంలో ఉన్నత స్థానాలలో చేరుకోవడానికి కృషి చేయాలని స్థానిక ఇంచార్జ్ ప్రిన్సిపల్ కోట్ల శ్రీనివాసరావు తెలిపారు. అనంతరం ఐటిఐ కళాశాల విద్యార్థులతో ప్రధానమంత్రి పరీక్ష పే చర్చా కార్యక్రమాన్ని విద్యార్థులకు లైవ్ ప్రోగ్రాం ద్వారా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఐటిఐ సిబ్బంది వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో పాల్గొన్న యువత

మాదకద్రవ్యాల రవాణాపై నిఘా

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

అక్రమంగా మాదక ద్రవ్యాలు, గంజాయి వంటివి రవాణా చేయడం చట్టరీత్యా నేరమని, దీనిపై ప్రత్యేక నిఘాతో ఎప్పటికప్పుడు వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నట్లు రూరల్ ఎస్సై సంతోషి తెలిపారు. ఇందులో భాగంగా మండలంలోని వెంకంపేట గ్రామ శివారు వై జంక్షన్‌లో సోమవారం ఆకస్మికంగా వాహనాలు తనిఖీ చేపట్టారు. ఒడిశా నుంచి రాష్ట్రానికి వచ్చే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించి అందుకు సంబంధించిన పత్రాలు పరిశీలించారు. ఈ సందర్భంగా వాహనచోదకులతో మాట్లాడుతూ ప్రయాణ వేళలో తప్పనిసరిగా ధ్రువపత్రాలు ఉండాలని, హెల్మెట్ ధరించాలని, ముఖ్యంగా మాదక ద్రవ్యాలను, గంజాయి తరలించడం, వాటిని నిల్వ చేయడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. ఎప్పటికప్పుడు అనుమానిత ప్రాంతాల్లో వాహన తనిఖీలు చేస్తున్నామన్నారు. అలాగే మద్యం తాగి వాహనాలు నడపడం కూడా నేరమవుతుందని సూచించారు.

సైబర్ నేరాలపై అవగాహన

సైబర్ మోసాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని గిరిజన గ్రామాల్లో ప్రజలకు రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో మండలం శివారు గ్రామం ఆంధ్రా-ఒడిశా సరిహద్దుల్లో ఉన్న లోవ వలసలో రూరల్ ఎస్సై సంతోషి కుమారి సిబ్బందితో పర్యటించి వారికి సెల్ఫోన్ వాడకంలో జరుగుతున్న అక్రమాలు, సైబర్ మోసాలు గురించి వివరించారు. అపరిచిత వ్యక్తుల నుంచి ఫోన్లు, మెసేజ్ లు వచ్చిన వెంటనే అప్రమత్తంగా ఉండాలని కోరారు.

సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

వికలాంగుల ధ్రువపత్రాల పరిశీలన

ప్రజాశక్తి - గరుగుబిల్లి

ప్రస్తుతం పింఛన్లు పొందుతున్న వికలాంగుల అర్హతను గుర్తించేందుకు మండలానికి సంబంధించి పార్వతీపురం ఏరియా ఆసుపత్రిలో ప్రభుత్వం నియమించిన వైద్యాధికారులు పరిశీలన చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం మండల పరిధిలోని రావివలస సచివాలయం పరిధిలో పింఛన్లు పొందుతున్న వికలాంగుల అర్హత ధ్రువ పత్రాలను పున: పరిశీలన చేయడంతో పాటు, పింఛన్లు పొందేందుకు అర్హులా ? కాదా అన్న విషయాలను వైద్యాధికారులు పరిశీలించినట్లు ఎంపిడిఒ జి.పైడితల్లి తెలిపారు. రాష్ట్ర ఆరోగ్య శాఖ నియమించిన వైద్యాధికారులు పింఛన్లు తీసుకునేందుకు అర్హులా కాదా అనే విషయాన్ని నిర్ధారించనున్నారని పేర్కొన్నారు. గ్రామ సచివాలయాల వారీగా నిర్ణయించిన తేదీల్లో పాలకొండ ఏరియా ఆసుపత్రికి వికలాంగులు ధ్రువపత్రాలతో పరిశీలనకు వెళ్లాల్సి ఉందని తెలిపారు. ఈ పరిశీలన పూర్తయిన అనంతరం పింఛన్లు తీసుకునేందుకు అర్హులైన వారి వివరాలను రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ అధికారులకు అందజేయనున్నారని తెలిపారు.

ధ్రువపత్రాల పరిశీలనకు వచ్చిన వికలాంగులు

ధరల పట్టికను పరిశీలిస్తున్న అధికారులు

సంతలో జిసిసి కాటా

ప్రజాశక్తి - సీతంపేట

సీతంపేటలో సోమవారం జరిగిన సంత మార్కెట్లో గిరిజన సహకార సంస్థ ఆధ్వర్యంలో జిసిసి కాటాను అధికారులు ఏర్పాటు చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు అటవీ ఉత్పత్తులు కొనుగోలు చేస్తున్నామని సేల్స్ మేన్లు దుర్గారావు, రాజారావు, బాల కృష్ణ తెలిపారు. ఈ మేరకు చింతపండు కిలో రూ.36కు కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. ప్రతి సంతకు వెళ్లి గిరిజనుల వద్దకు వెళ్లి అటవీ ఉత్పత్తులు ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. నగదు కూడా వెంటనే చెల్లిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిసిసి సిబ్బంది తదితరులు ఉన్నారు.

నేడు మూడో వారం జాతర

శంబరలో ముమ్మరంగా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - మక్కువ

పోలమాంబ అమ్మవారి మూడో వారం జాతర మంగళవారం జరగనుంది. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ ఇఒ సూర్యనారాయణ ఏర్పాట్లు చేపట్టారు. శంబర గ్రామంలో గత రెండు వారాల్లో పోలమాంబ జాతర సందర్భంగా పేరుకుపోయిన చెత్తా చెదారాలను సోమవారం తొలగించే కార్యక్రమాలు చేపట్టారు. ఉప సర్పంచ్ ఆలు వెంకట రమణ, కార్యదర్శి గణేష్ దగ్గరుండి గ్రామంలో పేరుకుపోయిన చెత్తను తొలగింపజేశారు. ఎక్కడా అపారిశుధ్యం లేకుండా చెత్త బండ్ల ద్వారా బయట పారబోస్తున్నారు.

అవార్డును అందుకుంటున్న జ్యోత్స్న

ఇఎంటి పరీక్షలో ప్రతిభ

ప్రజాశక్తి - మక్కువ

ఎడ్యుకేషనల్ ఎఫిసినియటీ ఎన్‌జిఒ సంస్థ ద్వారా నిర్వహించిన ఇఎంటి ప్రతిభా పరిక్షలో రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకను మక్కువ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థిని ఆర్ జ్యోత్స్న సాధించింది. పదో తరగతి చదువుతున్న జ్యోష్నకు రూ.25వేలు, ధ్రువపత్రంతో పాటు బహుమతిని సంస్థ సీమాట్ డైరెక్టర్ మస్తానయ్య విజయవాడలో ఆదివారం అందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఎం. హేమలత ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

పురుగుల మందు తాగి విద్యార్థి మృతి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

కురుపాం మండలం లంకాజోడు పాఠశాలలో 10వ చదువుతున్న పువ్వల వాసవి(15) అనే గిరిజన విద్యార్థిని సోమవారం మృతి చెందింది. జి.శివడలోని తన ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగి అపస్మారకస్థితికి చేరుకున్న ఆమెను వైద్యం కోసం భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా అప్పటికే మృతి చెందింది. వాసవికి చిన్నప్పుడే తల్లిదండ్రులు చనిపోవడంతో ఉయక కూర్మరావు, శకుంతల పెంచుకు ఒటున్నారు. హిందీ పరీక్ష ఉందని కుటుంబ సభ్యులు ఆదివారం ఇంటికి తీసుకువచ్చారు. ఇంట్లో గడ్డి మందు తాగడంతో తమ బిడ్డ అపస్మారక స్థితిలోకి వెళ్లిందని నోటి నుంచి నురగలు రావడంతో ఉన్నత వైద్యం కోసం భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువచ్చామని తెలిపారు. ఏ కారణం చేతో పురుగుల మందు తాగిందో అర్థం కావడం లేదని కుటుంబ సభ్యులు విలపిం చారు. ఎల్విన్‌పేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సారా కేసులో నలుగురు అరెస్ట్

ప్రజాశక్తి- సీతంపేట

మండలంలో నారాయణగూడ, చాపరాయి గూడ గ్రామ సమీపంలో నిర్వహించిన దాడుల్లో సారా కేసుల్లో పట్టుబడ్డ నలుగురు నిందితున్ని సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ వై అమ్మనరావు తెలిపారు. అక్రమంగా సారా తయారీ చేసినా అమ్మినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేరాలు ఘోరాలు

ఇసుక గుంతలో పడి వృద్ధుడు మృత్యువాత

ప్రజాశక్తి - భామిని

మండలంలోని బిల్లుమడ గ్రామానికి చెందిన కోటిలింగాల చక్రో (64) అనే వృద్ధుడు వంశధార నది గుంతలో పడి మృతి చెందాడు. కోటిలింగాల చక్రో ఎప్పటి లాగా సోమవారం బిల్లుమడ సమీపంలోని వంశధార నదికి స్నానానికి వెళ్ళాడు. వంశధార నదిలో స్నానం చేయకుండా, నీటితో నిండిన ఇసుక ర్యాంపు గుంతలోకి దిగాడు. లోతు ఎక్కువగా ఉండటంతో మునిగి చనిపోయాడు. మృతుని కుమారుడు నిరంజన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, పోస్ట్ మార్ట్ నిమిత్తం మృతదేహాన్ని పాలకొండ ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు బత్తిలి ఎస్ఐ డి.అనిల్ కుమార్ తెలిపారు. మృతుని భార్య కూడా ఆరు నెలల క్రితమే మృతి చెందింది.

520 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి-పార్వతీపురం

పార్వతీపురం మండలం పెదమరికి గ్రామ సమీపంలో అక్రమంగా రవాణా చేస్తున్న 520 లీటర్ల నాటు సారాను ఎక్సైజ్‌శాఖ అధికారులు పట్టుకున్నారు. ఈసందర్భంగా సారా రవాణా చేస్తున్న నిందితులు రాజాన తేజ, దేవుపల్లి కళ్యాణ్, గొర్లి నాగరాజు, గొర్లి అచ్యుత్ రావును అదుపులోకి తీసుకున్నారు వారిని పట్టుకున్న వారిలో ఎన్‌ఫోర్సుమెంట్ సిఐ ఎస్.సింహాద్రి, హెచ్‌సిలు జి.సుదర్శన్ కుమార్, కె.రాంబాబు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

పైడిమారమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే విజయ్‌చంద్ర

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

మండలంలోని హెచ్.కారాడవలసలో ఉన్న పైడిమారమ్మ మందిరం వార్షికోత్సవం సందర్భంగా గ్రామ పెద్ద పెదిరెడ్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం జరిగిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు

ఆర్థిక సాయం అందిస్తున్న నాయకులు

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి- గుమ్మలక్ష్మీపురం

కందికొత్త ఉత్సవాల్లో పాల్గొని ప్రమాదవశాత్తు మృతి చెందిన చెముడుగూడ గ్రామానికి చెందిన రమేష్ కుటుంబ సభ్యులకు ఆదివాసి జెఎసి నాయకులు మండంగి రమణ, నాగభూషణం రూ.42వేలు సాయం సోమవారం రాత్రి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రమాదవశాత్తు మృతిచెందిన రమేష్ కుటుంబానికి అండగా నిలవాలని ఉద్దేశంతో గిరిజన నాయకులు చందాల రూపంలో పోగుచేసిన సొమ్మును అందించామని అన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ అధ్యక్షులు పత్తిక శంకర్రావు, నాయకులు చలపతిరావు, దుమ్మంగి సర్పంచ్ పాలక క్రాంత్ కుమార్ తదితరులు ఉన్నారు.